# ఇన్లాండ్ లెటర్ కథలు

## జీవితం

బాబూ! స్నానం చేశావా! కాఫీ తాగుతావా! అని అమ్మ వంటింట్లోంచి అరుస్తుంది. ముసుగు తన్ని నిద్రపోతున్న విజయ్ విసుక్కున్నాడు. రోజూ ఇదే గొడవ అమ్మ తెల్లవార నివ్వదు. ప్రొద్దుటే లేవమంటుంది అని. తన ఫ్రెండ్స్ అంతా మేము 8 గం.కు లేస్తాం. విజయ్‌గాడు ప్రొద్దునే లేచి పాపం గేదెలకు పాలు తియ్యాలి. ఇంట్లో పనులు చూసి వస్తాడురా. అనే తోటి స్నేహితులు రోజూ ఎగతాళి చేస్తారు. విజయ్ పరమ పిసినారి. జేబులో ఎప్పుడూ పది రూపాయిలు మించి ఉండవు అని ఇంకొకరు తన మీద జోకులు బయటకు వెళితే స్నేహితుల గొడవ. ఇంట్లోకి రాగానే కాలేజీకి రోజూ వెళ్తున్నాను. మొన్న స్లిప్ టెస్ట్‌లో ఎన్ని మార్కులు వచ్చాయి అంటూ అమ్మ నిలదీస్తుంది. నాన్న గారిని పాకెట్ మనీ - అడిగితే ఎందుకు! దేనికి? అని లక్షా తొంభై ప్రశ్నలు ఛీ వెధవ బతుకు అయిపోయింది అని విసుక్కున్నాడు. అప్పుడే కాలేజీ జీవితంలోకి అడుగు పెట్టిన విజయ్‌కి ఇదంతా చాలా చిరాకుగా అనిపించేది. ఎప్పుడు ఫ్రెండ్స్‌తో సినిమాలు, సినిమాలో హీరోలా ఒక పది మంది గాంగ్‌ని వెంట పెట్టుకుని తిరగటం ఫ్రెండ్స్‌తో రోడ్డు మధ్యలో కూర్చుని బాతాఖాని కొట్టడం ఇదే లోకంగా భావించేవారు. తనకంటే తక్కువ ఆస్తి వున్న శివగాడు కొత్త బైక్ కొన్నాడు. ఇంకో ఫ్రెండ్ రమేష్ కూలింగ్ గ్లాసెస్ కొనుక్కున్నాడు. లైఫ్ ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు ఎంజాయ్ చెయ్యాలి అని ఇంట్లో రోజూ అమ్మతో గొడవపడేవాడు. కాని వాళ్ళ నాన్నగారి భయం, క్రమశిక్షణ వల్ల ప్రతీ సంవత్సరం మంచి మార్కులతో పాసయ్యేవాడు. ఫైనలియర్‌లో తన ఫ్రెండ్స్ స్లిప్‌లు పెట్టి దొరికి పోయి డిబార్ అయ్యారు. విజయ్ మాత్రం ఫైనలియర్ కూడా ఫస్ట్ క్లాసులో పాసయ్యి మంచి ఉద్యోగం సంపాదించుకున్నాడు. రమేష్, శివ ఇంకా తోటి స్నేహితులంతా చదువూ లేక ఇటు ఉన్న ఆస్థిని అనవసరం అయినా దర్పాలకు, సోకులకు తగలేసి కూలీ పనికి వెళ్ళడం చూసిన విజయ్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తను కూడా వాళ్ళలాగా లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యలేక పోయావనే బాధను మర్చిపోయాడు. ఆరోజు తల్లిదండ్రులు చెప్పిన మాట విని ఉండకపోతే తన గతి ఇలాగే ఉండేది కదా! అని తల్లిదండ్రులకు మనసులోనే కృతజ్ఞతలు తెలువుకున్నాడు.

—పి.శుభశ్రీ

వేదుళ్ళపల్లి (తూ.గో.)





## ఫేడవుట్

కొత్తగా ఉద్యోగంలో జాయిన్ అయిన ప్రేమానందంతో సదానందం... ఏంటోయ్ ప్రేమానందం! చాలా ఖుషీగా ఉన్నావ్!! నేను మా వీధిలో చూపించిన ఇల్లు నీకు బాగా నచ్చిందన్నమాట!" అంటూ ఆరా తీశాడు. 'గురూ గారూ... మీరు నాకు ఇల్లు చూపించడం అది నచ్చకపోవడమా! మాటికి నూరు పాళ్ళూ ఓ.కె." సంతోషంగా చెప్పాడు ప్రేమ్.

మరి మన ఆఫీసుకు దగ్గర దారి వుండగా అది వదిలి చుట్టూ తిరిగి వస్తున్నట్టూందే! ఇంకా నీ గెటప్ కూడా 'రాంబా'గా ఛేంజ్ వచ్చినట్టూందే! రెండో బాణం వదిలాడు సదానంద్.

–గురూగారూ మన ఆఫీసులో నా బాగోగులు మీరు కాక ఇంకెవరు చూస్తారు! నెమ్మదిగా ముగ్గులోకి దించాడు. ప్రేమ్. "ఇంతకీ ఏమిటీ సంగతి? చెప్పమరి సదానందం అడిగాడు.

మన ప్రక్క వీధిలో రెండో అంతస్తులో ఓ మెరువు తారని చూసిందగ్గర్నుంచి నా మనసు నిలవడం లేదు. నిద్ర రావడం లేదు. దిగులుగా చెప్పాడు ప్రేమ్.

అలా... దారికి రా... ఇంతకీ అది గులాబీ రంగు మేడేనా! అడిగాడు సధానందం.

"అవున్సార్! ఆ అమ్మాయి మీకు తెల్సా?! ఆతృతతో అడిగాడు ప్రేమ్.

నాకు తెలీకపోవడమేమిటి! నువ్వు 'ఊ' అనాలి. ఆమె నీ పక్కన ఉండడం క్షణాల్లోని పని!

అంత అదృష్టమా!! ఆశ్చర్యపోతూ అన్నాడు ప్రేమ్.

అదృష్టమో దురదృష్టమో తర్వాత! ఇక్కడ కొంత సస్పెన్స్ వుంది. ముందు నాకు పార్టీ ఇస్తే ఆ సస్పెన్స్‌ని విప్పి చెబుతాను అన్నాడు సదానందం

పార్టీ ముగిసింది–

సార్! మరి ఏదో ఉందన్నారుగా... అదేదో విప్పి చెప్పండిక అన్నాడు ప్రేమ్

ఆ అమ్మాయికి వెనకా ముందూ ఎవరూ లేరు. చిన్నప్పట్నుంచీ ఆ మేడ వాళ్ళు ఆమెను పెంచుకుంటున్నారు. ఇంకా, ఆ అమ్మాయి అవిటి– మూగ– మరి. ప్రేమ ఆదర్శం– ఇక నీ ఇష్టం! అని అన్నదే తడువు ప్రేమచందం అతడినించి ఫేడవుట్ అయ్యాడు!

—యు.చిట్టిబాబు

కొత్తగూడెం.